# 53

# "తప్పించుకు తిరుగువాడు"

'ఏమండీ, ఏమండోయ్' అంది సీత మొగుడి వెనకాలే గదిలోకి వస్తూ.

'ఎందుకండోయ్?' అన్నాడు రవణ నవ్వుతూ.

'అంత వెటకారంగా ఉంటే నే చెప్పనే చెప్పను.'

'అంత పెంకితనంగా ఉంటే నే విననే వినను.'

'అంతే నన్నమాట?' అని సీత అదోలా మొహంపెట్టి, వెళ్ళి పోతున్నట్టు నటిస్తున్న మొగుడి కాళ్ళకు బ్రేకులు వేసింది కళ్ళతో.

'అది కాదే సీతా, యింకా షేవ్ చేసుకుని, నీళ్ళోసుకుని, డ్రెస్ చేసుకుని క్రికెట్ మ్యాచ్‌కి వెళ్ళాలి తెలుసా?'

'పాతికేళ్ళు పైబడినా అటు యింటిపెత్తనం పైబడక—యిటు పిల్లలకీ లోబడక కుర్రాడిలా ఆటలా? ఏం వాటంగా ఉం డీ పాటూ? అడిగేవాడు లేకగాని...'

'లేకేం? నా నాటకంలో నాయకురాలివి నువ్వున్నావ్‌గా! నీకు మాత్రం బాధ్యత ఏముంటుంది గనక? ఇంత పూర్వకాలపు వంశంలోనూ సినిమాలనీ, షికార్లనీ, కబుర్లనీ, క్లబ్బులనీ—ఎడపిల్లా, చేతిపిల్లా ఎడాపెడా ఏడుస్తూంటే ఎక్కడికి పోనో యీ కబుర్లు? తొందరపడ్డవాడికీ, ముందు చూపు ఉన్నవాడికీ అదే తేడా! ప్లానింగ్ మేడమ్, అంతా ప్లానింగ్!'

మధ్యతరగతి కుటుంబంలోని మానవుడై పుట్టి—పరిస్థితుల్నీ పరిసరాల్నీ పరీక్షించి, సమీక్షించి, ఆలోచించి ఆచరణలోపెట్టి, ఎన్నాళ్ళు గడచినా 'శోభనం పెళ్ళికొడుకు'లా కబుర్లు చెబుతున్న భర్తను చూసేసరికి సీతకి జన్మ తరించినట్లయింది. అంతకన్న ఉన్నత స్థానం తెలిపైన ఏ స్త్రీ కోరుతుంది? భర్తకి దగ్గిరగా వచ్చి అతని గుండీలు సవరించడం ప్రారంభించింది.

'నిజమే—తెలివి ఉండగానే సరిగాదు—దాన్ని తెలివిగా ఉపయోగించు కోడంలోనే ఉంది తెలివి. అది సరే, నా మాటేం చెప్పేరు?'

'నీ మాటేమిటో నువ్వు చెప్పండే!'

సీత అదేమిటో చెప్పేలోగా అత్తగారు అక్కడికి రానే వచ్చింది. సుబ్బమ్మ గుమ్మందగ్గిరే నిలబడి పోయింది.

'ఎవరదీ, అమ్మా? రా, ఇలా లోపలికి.'

'అబ్బే, ఏదో కబుర్లు చెప్పుకుంటున్నారు, మధ్య నేనెందుకనీ!'

'మామూలు కబుర్లే, రా.'

సుబ్బమ్మ లోపలికి వచ్చి కూర్చుంది. తల్లీ కొడుకూ ఉన్నప్పుడు తను మధ్య ఉండకూడదని ఆ 'తనుమధ్య'కు తెలుసు. ఇంకా లేచి వెళ్ళిపోదా మనుకొంటూండగా అత్తగారు అననే అంది.

'సీతా, తోటకూర కడిగి అరుగుమీద పెట్టేను. తరిగేసి పొయ్యిమీద పడెయ్యి. ఓ పది వడియాలు తీసి వేయించు. రెండు పొట్లు వడియాలు కూడా వేయించు, రవణకి యిష్టం.' ఈ మాట పూర్తయేసరికి సీత అక్కడ లేదు.

'ఏమిట్రా నీ పెళ్ళాం నీతో అంటోందీ?'

'ఏం లేదమ్మా.'

'చాల్లేరా, పప్పుగిన్ని అలా దించేసి పరుగెత్తుకొచ్చింది. అరగం టయింది. నే చూళ్లేదనుకున్నావా?...పుట్టింటికి వెడతాననేనా?'

రవణ మాటాడలేదు.

'వేరింటి కాపురం పెడితే వేడుకగా వెలిగించేదేమో! అన్నిటికీ కంట కంగా ముసలి ముండని నేనొకర్తిని తగులడ్డాను మరి!...అభిమానం నీ కుండొచ్చు, దాని కుండొద్దూ? అమ్మ కొట్టినా రుచిగానే ఉంటుంది, అత్త పెట్టినా పనికిరాదు మరి. ఇంతకీ అదేమందో చెబుదూ!'

'నాతో ఏమీ అనలేదమ్మా, సంగతేమిటో చెప్పు. కనుక్కొని చివాట్లు పెడతాను.'

సుబ్బమ్మ అటువైపు చూసివచ్చి మళ్ళీ మొదలెట్టింది.

'ఏం లేదురా, మొన్నటికిమొన్న నాలుగు నెలలయిందో లేదో తమ్ముడి పెళ్ళాం నీళ్ళాడిందని తనెళ్ళి పదిహేను రోజులు ఉండొచ్చింది. వినాయక చవితి ఏమంత పెద్ద పండుగని చెప్పు ?...'

రవణ సుబ్బమ్మ మొహంవైపు చూశాడు. అందులో 'కోడలు పుట్టింటికి వెళ్ళి సుఖపడిపోతుందేమో' అన్న అసూయతో కూడిన ఆత్రుతకంటే మించిన...అన్నిటినీ అధిగమించిన...అతి చక్కని భావం కనబడి అతని మనసు సుగంధం వ్యాపించిన పువ్వులతోట అయింది.

తల్లి పిల్లని కొడుతుంది, ద్వేషమా ?

తల్లి కోడల్ని తిడుతుంది, అసూయా ??

తన చెల్లెలు అత్తారింటికి వెళ్ళేనాడు అమ్మ కళ్ళనిండా నీళ్ళు పెట్టుకుంది. అవి మళ్ళీ సీత అత్తారింటికి వచ్చిననాడే నిశ్చింతగా తుడుచుకుంది.

అమ్మ అర్థంలేని తిట్లకు నిధి. ఆ కాలపు అమ్మలక్కల ప్రతినిధి. అయితే ? అభిమానానికి పెన్నిధి — కాదా ?

సీత ఆ మధ్య విశాలాక్షికొడుక్కి పుట్టిన రోజయితే పేరంటానికి వెళ్ళింది. చీకటిపడినా యింటికి రాలేదు.

'ఈ కాలపు వాళ్ళతో పడలేం బాబూ. వద్దే అమ్మా అంతదూరం అంటే ఒక్కర్తీ నడిచి వెళ్ళింది, చీకటి రాత్రుళ్ళు కూడాను...'

నాటకాలు వేయించే రవణకి చిన్ననాటకం ఆడాలనిపించింది.

'మొన్నటికి మొన్న...యింకా ఎనిమిదేనా కాలేదు. పాల నూకమ్మ కూతురు వస్తూంటే అడ్డుపడి చెవి పోగులు తెంపుకున్నారట...'

'...అయ్యో అయ్యో వెళ్ళరా బాబూ, వెళ్ళి తీసుకురారా !'

'నాకేం ? నేనేం తీసుకురాను ? చిన్నదా, చితకదా ? అత్త మాట వినక పోవడమేం ? ఇది కాకపోతే మ రొక త్తి...నే చస్తే వెళ్ళను.'

సుబ్బమ్మ యీ చివరి మాటలు వినిపించుకోలేదు...ఇంట్లోకి వెళ్ళి అయిదు నిమిషాల్లో బట్ట మార్చుకుని చేత్తో లాంతరుతో సిద్ధమైంది.

'చూడారే రవణా, నన్నెవడూ ఏం చెయ్యడుగదా. యిప్పుడే వస్తా. యిల్లు జాగ్రత్త.'

'అదేమిటే అమ్మా, ఎక్కడికీ ?'

'ఇంకెక్కడికి ? నీ కింతకన్నా పెంకిపెళ్లాం రావొచ్చుగాని, నా కింత కన్న కొంటె కోడలు రాదుగా ? అప్పుడనగా వస్తానంది, ఏమైందో పెర్రి పిల్ల...' తల్లి వెయ్యేళ్ళు జీవించేటట్లు దీవించమని రవణ దేవుణ్ణి ప్రార్థించాడు. సైకిలుమీద వెంటనే బయలుదేరి విశాలాక్షిగారింటి కెళ్ళేసరికి సీత చాలా సేపై వెళ్ళిపోయిం దన్నారు. హడలిపోతూ యింటికొచ్చేడు.

'ఏంరా, నీ పెళ్ళాం ఏదీ ?' అని అడిగింది గుమ్మంలోనే సుబ్బమ్మ.

రవణ ఆత్రుత ఆకాశాన్నంటింది. ఆ గాభరా చూసి సుబ్బమ్మ వెనక దాక్కున్న సీత నవ్వకుండా ఉండలేకపోయింది.

'దారే గదా అని మా రాజ్యంగారింటికి వెళ్ళొచ్చానండీ, అంతలోనే అంత యిదా ?' సుబ్బమ్మ ఊరుకోలేదు.

'అంతలో అలకలు, అంతలో పులకలు ! కలికాలపు చిలకలు ! నా కెందుకమ్మా, భోజనానికి లేవండి ముక్కలు చల్లారిపోతున్నాయి.'

* * * *

'ఏమిరా, ఏమిటంత ఆలోచన, ఏమంటావ్ ?' అని అడిగింది సుబ్బమ్మ.

'నీ మాట ఒకటీ నా మాట ఒకటీనా అమ్మా ! అయినా నువ్వు చెప్పిన దాన్లో సబువు లేదు గనుకనా ? మాటాడితే యీ ప్రయాణా లేమిటీ మంచీ చెడ్డా లేకుండాను ? నేను ఒక్కనాటికి పంపను తెలుసా ?'

'మా నాన్నే ! మా బాబే ! !' అనుకుంది ఆనందంగా సుబ్బమ్మ.

'నా మొగుడే ! రాక్షసుడే ! !' అనుకుంది తాత్కాలికంగా ఆ మాటలు విన్న సీత.

*  *  *  *

'అత్తగారు నన్ను విడిచిపెట్టలేకే వెళ్ళొద్దంటున్నారని నాకు తెలుసు. కాని ఎన్నిసార్లు చెప్పినా ఆవిడ వినిపించుకోడంలేదు. నేనేం చెయ్యను? ఈ వినాయక చవితికి మా నాన్నకి అరవై నిండుతాయి. షష్ఠిపూర్తి కూడా చేస్తే చేద్దామని అనుకుంటున్నామనీ, మరీమరీ రమ్మనీ కబురు పంపేరు. ఈసారి ఎక్కడెక్కడివాళ్ళూ వస్తారు. బొంబాయినుంచి మాపెద్దన్నయ్యకూడా వస్తాట్ట. వాణ్ణిచూసి ఎన్నేళ్ళో అయింది. ఆడదాన్ని, చూడకుండా ఎలా ఉండగలను చెప్పండి?'

రవణ అన్నీ సావకాశంగా విన్నాడు.

'ఇవన్నీ అమ్మతో చెప్పేవా?'

'అయ్యో, అన్నీ చెప్పేను — ఆవిడసలు నా మాట వినిపించుకుంటేనా? చూడండి. నామాటే వినమని మిమ్మల్నెప్పుడూ నిర్బంధించలేదు. మీకు ఏది న్యాయమనితోస్తే అలా చెయ్యండి.'

ఆడుతూ పాడుతూ హాయిగా దినాలు గడిపే రవణ యింత యిరుకున పడతాడని కలలోకూడా అనుకోలేదు. అతనలా మౌనంగా ఉండిపోవడం — అందులో అర్ధాంగీకారం ఆ అర్ధాంగికి — అర్ధాంగేం కర్మ, పూర్ణాంగికి — ఏమీ నచ్చలేదు.

'నా మొగుడు నామాటే ఆడతాడనే సంతోషం అటుంచి — ఉన్నమాట గట్టిగా చెపుతారనే ధైర్యంకూడా పోతోంది — పోసింది, ఏడుస్తూ ఇక్కడే ఉంటాను, మీ అమ్మగారి మాట జరపడమేగా మీకు కావలసిందీ?'

రవణ ఆశ్చర్యంగా సీతవైపు చూశాడు. ఎంత గంభీరమైన స్వభావం వున్నవాళ్ళయినా ఆడాళ్ళు ఎంత త్వరగా తేలిపోతారు! ఎటూ చెప్పలేని దురవస్థలో రవణ కొట్టుకుపోతూండగా వీధి గుమ్మంలో బండి ఆగింది. సీత కిటికీలోంచి చూసింది.

సుందరమ్మొదిన! ఈవిడకేం పనీ పాటా లేదు — ఈ వేళప్పుడు ఎందుకొచ్చినట్లో!'

సుందరమ్మ రవణకి దూరపు చుట్టం — వరసకి అక్క అవుతుంది. బాగా ఆస్తి ఉన్న వితంతువు. ఎవర్నీ పెంచుకోదు. వాళ్ళకి వీళ్ళకి ముళ్ళెట్టి రోజులు వెళ్ళబుచ్చుతూంటుంది. ఎక్కడేనా కాస్త చల్లగా సంసారం సాగుతోందంటే అక్కడికి బండి కట్టించేస్తుంది.

'అత్తగారసలే అమాయకురాలు ... ఈవిడేం పుల్ల పెడుతుందో!' అంది సీత భయంగా.

'సరీగ్గా సమయానికొచ్చింది. మునిగిపోతున్న నాకు పడవలా దొరికింది. సుందరమ్మక్కయ్యా, నువ్వు వెయ్యేళ్లు బతకాలి!' అన్నాడు రవణ. సీత మొగుడి మొహంకేసి అతి ఆశ్చర్యంగా చూసింది. రవణ సీతకి జరిగిందీ జరగవలసిందీ బోధపరచి కష్టపడి ఒప్పించాడు.

* * * *

రవణ పొద్దుటే లేచి ఆఫీసులో అర్జంటు పనుందని — మధ్యాహ్నం భోజనం పంపించమని — సాయంకాలం వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

ఏడుగంట లయింది, సీత యింకా లేవలేదు.

'అదేమిటి పిన్నీ, జాంపొద్దెక్కిందే, యింకా కోడలు లేవలేదూ?' అని బుగ్గలు నొక్కుకుంది సుందరమ్మ.

'లేస్తుంది లేవే, లేచేం చెయ్యాలి? ఇంకా చిన్నతనం...' అని సర్దిబోయింది సుబ్బమ్మ.

'ఏం సత్తెకాలమే నా తల్లీ...యింకా నీ కోడలు చిన్నపిల్లా ? ఉయ్యాలేసి ఉగ్గు పట్టకపోయావా ? అవ్వ ! ఇది మా రాముడు యీడుది. ఇరవై దాటింది. ఈపాటికి నలుగురు పిల్లలు పుట్టవలసిన మాట. నువ్వయితే యిలా ఊరుకున్నావ్ గాని నేనయితే యీ గొడ్డుమోతుని గుమ్మంలో లేకుండా కొట్టికొట్టి పంపేదాన్ని.'

గదిలోంచి యీ మాటలు వింటున్న సీతకి సుందరమ్మ అక్క సుభద్రయ్యమ్మ మాట జ్ఞాపకంవచ్చి నవ్వొచ్చింది.

ఆవిడ కోడలు కడుపుతో ఉండే నొప్పులు వచ్చేదాకా చాకిరీ చేయించింది. నొప్పు లొస్తూంటే రిక్షా ఎక్కించి పుట్టింటికి దిగబెట్టించింది. పాపం కోడలుకి ఆడపిల్ల పుట్టి పోయింది. ఈ కబురు చెప్పడానికి వియ్యంకుడొస్తే ఆమె ఏమన్నదో తెలుసా ?

'చాలు చాల్లేవయ్యా ! నువ్వు చచ్చి, నేను చచ్చి, మంత్రసాని చచ్చి ఆడపిల్లనంటే కన్నానని మనవరాలు చచ్చి — ఏ మొహం పెట్టుకు వచ్చావ్ చెప్పడానికి ? ఇక్కడుండమంటే ఉందా ? ఇక్కడే ఉంటే పనసపండు లాంటి మొగపిల్లాడు పుట్టడూ ?'

ఆ సుభద్రయ్యమ్మ చెల్లెలే ఈ సుందరమ్మ !

సీత గదిలోంచి యివతలి కొచ్చింది.

'ఎప్పుడొచ్చావ్ వదినా ?...' అని ఆప్యాయంగా పలకరించి మొగుడి మాట జ్ఞాపకంవచ్చి మొహం చిట్లించి !... 'అయినా నువ్వు ఎప్పుడొస్తే నాకేంలే' అని అవతలకి వెళ్ళిపోయింది.

'చూశావా, చూశావా ఎంత పొగరో !' 'అయినా ఎంత వెర్రిదానివి పిన్నీ నువ్వూ ! బోడెద్దుకు పోట్లు మప్పుతావు ! ఎలా తయారయిందీ, నే నెప్పుడు వస్తే తనకేమిటట ! — నాలాంటి దిక్కులేంది ఒకచోటికి రావడమే తప్పులే. నీ కోడలు బాగానే చెప్పుదెబ్బలు కొట్టిందిలే సుబ్బమ్మ

పిన్నీ ! ఇక జన్మలో రాను. నీ కోడలి పెద్దలికి వెయ్యివేల నమస్కారాలు. పోతున్నాను..."

కళ్ళనీళ్ళెట్టుకుని సుందరమ్మ లేచి నిలబడింది.

'అదేమిటే సుందరమ్మా, మామూలు మాటకి అంత గొడవ చేస్తావ్. ఉండు నే కనుక్కుంటాను — అవునే అమ్మాయీ ఏమిటీ ఆగడం ? ఇంటి కొచ్చిన మనిషిని అలాగేనా ఆదరించడం ?'

'అవు నత్తయ్యా పొరపాటయిపోయింది... అని నేనంటానని మీ ఉద్దేశం కాబోలు. ఇది నాయిల్లు, నా యిష్టం...నా యింటికొచ్చిన వాళ్ళని ఎలా ఆదరించాలో నా కొకరు చెప్పనక్కర్లేదు.'

సుబ్బమ్మ ప్రాన్పడిపోయింది. ఈ మాటలు సీత అన్నవేనా !

'లాభంలేదు — ఇహ లాభంలేదు సుబ్బమ్మ పిన్నోయ్...ఇంకా న్నే పుంటే నీ కోడలు నన్ను కొడుతుంది కూడాను...'

'ఆగు...నువ్వాగు సుందరమ్మా ! అవునే సీతా యివాళ యిలా చిత్రంగా మాట్లాడుతున్నావ్ ఏ మొచ్చింది నీకు ? ఈ యిల్లు నీదా ?

'అయితే మీ అత్తగారు నీ తిండి తినే నౌఖరా ?' అని సుందరమ్మ అందించింది.

'ఏమో మీరు ఎలా అనుకున్నా నాకేం అభ్యంతరం లేదు.' సీత తెచ్చి పెట్టుకున్నకోపంతో భళ్లని తలుపేసుకుంది. సుబ్బమ్మ నోట మాట రాలేదు!

'అయిందా ? నీ కోడలు గుణం యీ నాడు నీకు పూర్తిగా తెలిసిందా? నీ దారి నిన్ను చూసుకోమని అంత స్పష్టంగా చెబుతున్నా నీకు బోధపడదేం పిన్నీ ? దాని మొగుడు గడించి దాని చేతులో పోస్తున్నాడు. వెర్రిదానివి వెళ్ళతావుగాని వాళ్ళ కంటికి నువ్వేవర్తవీ ? 'తల్లి విషమాయె. పెళ్ళాము బెల్లమాయె' అని నువ్వు వినలేదటమ్మా ? ఇక్కడింకా చాకిరీ చేస్తూ పడుండడానికి నీకేనా అంత సిగ్గులేకపోయిందీ ? కానియ్, ఎవళ్ళేనా ఉట్టి

గట్టుకు ఊరేగుతారా, లోకం గొడ్డోయిం దనుకున్నారా? ఊరుకో పిన్నీ ఏడవకు,' అని ఓదార్చింది సుందరమ్మ.

*  *  *  *

కొడుకు గుమ్మంలోకి వచ్చీరాగానే సుబ్బమ్మ ఏడుస్తూ జరిగిందంతా చెప్పింది.

'బాబూ నేనింక యీ యింట్లో క్షణం ఉండలేనురా, నన్ను రైలెక్కించై'

'నీకేమయినా మతిపోయిందా అమ్మా? కట్టుకున్న దుర్మార్గురాలి కోసం, కన్నతల్లిని వదులుకుంటారా? దాన్నే రైలెక్కించేస్తాను.'

'అనడమేగాని నువ్వు చేసి చూపించేదీ. ఆ భరోసా మీ అమ్మకేది?' అంది వెర్రి సుందరమ్మ తను చేస్తున్నది ఉపకారమో అపకారమో తెలియక:

'ఇదిగో...ఇప్పుడే!...దానిలాంటి దానికి ప్రస్తుతం కావలసిందే' అన్నాడు రవణ.

'మా నాన్నే! మా బాబే!' అనుకుంది సుందరమ్మ.

*  *  *  *

'ఏమోనండి, నాకు భయంగా ఉంది. పాపం ఆవిడ్ని అనరాని మాటలన్నాను. అత్తగారు నన్ను క్షమిస్తారా? మళ్ళీ మామూలుగా ప్రేమిస్తారా?' రైలు పెట్టెలోని భార్యకేసి నవ్వుతూ చూశాడు ప్లాటుఫారం మీదున్న రవణ.

'ఎంత అమాయకురాలివే సీతా నువ్వు! చాలామందికి నిజంకన్న అబద్ధంమీదే మోజు ఎక్కువనీ, స్వభావంకన్న నటనే రుచి అనీ నీకు తెలీదా?

ఈ లోకంలో సరిదాగా బతకాలంటే కొంత నటన తప్పదు మరి! వెర్రి అమ్మ!

ఆమె సంగతి నీకు తెలీదూ? ఒక్కరోజు నువ్వు కనబడకపోతే బాధపడిపోతుంది. నువ్వు ఒక్క క్షమాపణ ఉత్తరం రాస్తే అన్నీ మరచిపోతుంది.

నువ్వు నిశ్చింతగా గడిపిరా. మీ నాన్నకి మాత్రం నా చేతికర్ర ప్రెజెంటు మరచిపోకేం?'

రైలు కదిలింది. 'నా మొగుడే! మాధవుడే!!' అనుకుంది చిరునవ్వుతో సీత!